క్లుప్తంగా

బాధితుడికి ఎమ్మెల్సీ కవిత ఆర్థిక సాయం



సిరికొండ: మండల కేంద్రానికి చెందిన బాధితుడు ప్రభాకర్‌కు ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత రూ.10వేల ఆర్థిక సహాయం చేశారు. ప్రభాకర్‌కు వెన్నుపూస ఆపరేషన్ అయి మందులకు డబ్బులు లేక బాధపడుతున్న విషయాన్ని భారత జాగృతి రూరల్ నియోజకవర్గ కన్వీనర్ మల్లెల సాయిచరణ్ ఎమ్మెల్సీ దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో ఎమ్మెల్సీ కవిత నగదును పంపగా సాయిచరణ్ బాధితుడికి మంగళవారం అందజేశారు. బాధిత కుటుంబ సభ్యులు ఎమ్మెల్సీకి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జాగృతి నాయకులు భూపతి, పులిరెడ్డి, భాను, భరత్, వినోద్, పెద్ద సాయిలు, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రీయ విజ్ఞాన శాస్త్ర ప్రదర్శన



సిరికొండ: మండల కేంద్రంలోని సత్యశోధక్ పాఠశాలలో జాతీయ సైన్స్ దినోత్సవం(ఫిబ్రవరి 28)ని పురస్కరించుకొని శాస్త్రీయ విజ్ఞాన శాస్త్ర ప్రదర్శనను మంగళవారం నిర్వహించారు. ఈప్రదర్శనను ప్రిన్సిపల్ నర్సయ్య ప్రారంభించిన అనంతరం మాట్లాడారు. విద్యార్థులలో ప్రతిభను వెలికి తీయడానికి వినూత్న ఆలోచనలను రేకెత్తించడంలో సైన్స్ పాత్ర ప్రధానమైనదని ప్రిన్సిపల్ పేర్కొన్నారు. విద్యార్థులు ప్రదర్శించిన సైన్స్ నమూనాలు, వినూత్న పరికరాలు, వ్యవసాయ ఆధారిత పనిముట్ల సాధనాలు ఆకట్టుకున్నాయి. విద్యార్థులకు వ్యాసరచన, ఉపన్యాసం, చిత్రలేఖనం, క్విజ్ పోటీలను నిర్వహించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అలరించిన విద్యార్థుల ఆటపాటలు



రెంజల్(బోధన్): పట్టుదలతో చదివితేనే విజయాలు వరిస్తాయని ఎంఈవో ఆంజనేయులు అన్నారు. రెంజల్‌లోని ఆదర్శ పాఠశాల పదో తరగతి విద్యార్థులకు మంగళవారం ఆత్మీయ వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఎంఈవో మాట్లాడుతు పరీక్షల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను విద్యార్థులకు వివరించారు. విద్యార్థులు సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. కార్యక్రమంలో మండల పీఆర్‌టీయూ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సోమలింగంగౌడ్, కిషోర్‌కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మండలం చేపూర్ క్షత్రియ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థుల వీడ్కోలు సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు నాటిక ప్రదర్శనలు, పాటలు, నృత్యాలతో అలరించారు.

బోధన్: పట్టణంలోని విజయ సాయి ప్రాథమిక పాఠశాల వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. బోధన్ కోర్టు న్యాయమూర్తి శేషతల్ప సాయి, ఎంఈవో నాగయ్య, సీఐ వెంకట నారాయణ ముఖ్య అతిథులుగా హాజరై విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. విద్యార్థుల ఆటపాటలు అలరించాయి.

టెన్త్ ఇంటర్నల్ మార్కుల పరిశీలన



కమ్మర్‌పల్లి: మండలంలోని కోనాపూర్ జెడ్పీహెచ్ఎస్‌లో పదో తరగతి విద్యార్థుల మార్కుల అంతర్గత మూల్యాంకనంను ఎంఈవో రాజగంగారాం మంగళవారం పరిశీలించారు. విద్యార్థుల మూల్యాంకనంపై సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులను వార్షిక పరీక్షల కోసం సన్నద్ధం చేయాలని సూచించారు. హెచ్ఎం కనక గంగాధర్, ఉపాధ్యాయులు కృష్ణారెడ్డి, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

టీబీ చికిత్స సేవలు ఉపయోగించుకోవాలి

వేల్పూర్: స్థానిక పీహెచ్‌సీలో అందుబాటులోకి వచ్చిన టీబీ చికిత్స సేవలను రోగులు ఉపయోగించుకోవాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో రమేశ్ పేర్కొన్నారు. మంగళవారం పీహెచ్‌సీలో టీబీ ఇంజక్షన్‌ను ప్రారంభించిన సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. క్షయ వ్యాధి నివారణకు ముందస్తు చర్యల్లో భాగంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు టీబీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాయని చెప్పారు.

చివరి రోజు హోరాహోరీగా..



వాకర్స్ అసోసియేషన్ సభ్యులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే భూపతిరెడ్డి



ప్రచారం చేస్తున్న యూత్ కాంగ్రెస్ నేతలు

- పోటా పోటీగా ప్రచారం చేసిన బీజేపీ, కాంగ్రెస్ పార్టీల నాయకులు
- ముగిసిన ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం

నిజామాబాద్ సిటీ : ఎమ్మెల్సీ ఎన్నికల చివరి రోజు కాంగ్రెస్, బీజేపీ పార్టీల నాయకులు హోరాహోరీగా ప్రచారం చేశారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు విపుల్ గౌడ్ ఆధ్వర్యంలో నగరంలోని పలు చోట్ల కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్ రెడ్డికి మద్దతుగా యూత్ కాంగ్రెస్ నాయకులు ప్రచారం చేశారు. అలాగే కాంగ్రెస్ సీనియర్ నాయకులు కోనేరు సాయికుమార్, ఏఎస్ పోశెట్టిలు జిల్లాకేంద్రంలోని నాందేవ్‌వాడ, దుబ్బ, గంజ్ తదితర ప్రాంతాల్లో ఎన్నికల ప్రచారం చేశారు. నాయకులు తూంపల్లి మహేందర్, ఎడ్ల లక్ష్మణ్, మోహన్, రాజు తదితరులున్నారు.

సిరికొండ: మండలంలోని రావుట్ల గ్రామంలో కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని పట్టభద్రులను వారు కోరారు. ప్రచారంలో డీసీసీ కార్యదర్శి ఎర్రన్న, నాయకులు డీలర్ రమేష్, ప్రసాద్, సామేల్, భాస్కర్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ పాలనలో నిరుద్యోగులు, టీచర్లకు భరోసా లేదు : అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్



మాట్లాడుతున్న ధన్‌పాల్ సూర్యనారాయణ

సుభాష్‌నగర్ : కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో నిరుద్యోగులు, ఉపాధ్యాయులు, ఉద్యోగులకు భరోసా లేదని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ విమర్శించారు. పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లోభాగంగా నగరంలోని కంఠేశ్వర్ మార్కండేయ పద్మశాలి సంఘం భవనంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వం యావత్ తెలంగాణ ప్రజలను మోసం చేసిందన్నారు. నిరుద్యోగులను నిండా ముంచిన కేసీఆర్‌కు ఏ గతి పట్టిందో.. రేవంత్‌రెడ్డికి, కాంగ్రెస్‌కు కూడా అదే గతి పడుతుందన్నారు. మండలిలో ప్రశ్నించే గొంతుకలైన బీజేపీ అభ్యర్థులు మల్క కొమరయ్య, అంజిరెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ఆయన కోరారు. సమావేశంలో నాయకులు నాగోళ్ల లక్ష్మీనారాయణ, మండల అధ్యక్షుడు ఆనంద్‌రావు, కార్యకర్తలు, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

అన్నివర్గాల సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం..

మోపాల్: రాష్ట్రంలోని అన్నివర్గాల సంక్షేమానికి ముఖ్యంగా నిరుద్యోగులు, ఉద్యోగ, ఉపాధ్యాయుల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం విజన్‌తో ముందుకు సాగుతుందని నిజామాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని న్యాల్‌కల్‌లో పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్‌రెడ్డి తరఫున ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా పట్టభద్రుల ఓటర్లను వ్యక్తిగతంగా కలుస్తూ 14 నెలల కాంగ్రెస్ పాలనలో చేపట్టిన పథకాలు, తీసుకున్న నిర్ణయాలను వివరించారు. మాజీ సర్పంచి గంగాప్రసాద్, డీసీసీబీ డైరెక్టర్ లింగన్న, నాయకులు విద్యాసాగర్, కిరణ్ రావు, సతీష్‌రావు, బట్టి శ్యామ్, అంజా గౌడ్, , తదితరులున్నారు.

పార్టీ అభ్యర్థిని గెలిపించండి : భూపతిరెడ్డి

నిజామాబాద్ రూరల్ : ఎమ్మెల్సీ ఎన్నికల్లో పట్టభద్రులు, ఉపాధ్యాయులు ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి అన్నారు. నాలుగో డివిజన్ పరిధిలో గల బ్యాంక్ కాలనీ కమ్యూనిటీ హాల్‌లో మంగళవారం పట్టభద్రుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా పాల్గొని ఆయన మాట్లాడారు. ముబారక్ నగర్ కాలనీలో పట్టభద్రులను కలిసి కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్ రెడ్డిని గెలిపించాలని కోరారు. పాలిటెక్నిక్ కళాశాల గ్రౌండ్‌లో వాకర్ అసోసియేషన్ సభ్యులను, జిల్లా కోర్టు సముదాయంలో పలువురు న్యాయవాదులను, గంగస్థాన్ ఫేజ్-1,2 ,లక్ష్మిప్రియ నగర్ కాలనీల్లో పట్టభద్రులను, బాపూజీ వచనాలయంలో మహిళలను కలిసి కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్‌రెడ్డికి మద్దతుగా ఆయన ప్రచారం చేశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి, పీసీసీ డెలిగేట్ శేఖర్ గౌడ్, డీసీసీ ప్రధాన కార్యదర్శి భాస్కర్ రెడ్డి, రూరల్ నియోజకవర్గం యువ నాయకులు ఉమ్మాజీ నరేష్, భాగారెడ్డి, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు. అలాగే నిజామాబాద్ రూరల్ మండలంలోని సారంగాపూర్‌లో కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్ రెడ్డి మద్దతుగా కాంగ్రెస్ నాయకులు ప్రచారం చేశారు.

ఉద్యోగ, నిరుద్యోగుల సమస్యలు పరిష్కరిస్తా



మాట్లాడుతున్న రాథోడ్ రవీందర్ నాయక్

నిజామాబాద్‌నాగారం : ఉద్యోగుల, నిరుద్యోగుల సమస్యలను పరిష్కరిస్తానని, ఈవిషయాన్ని గుర్తుంచుకొని పట్టభద్రులు ఓటు వేయాలని ఎమ్మెల్సీ అభ్యర్థి రాథోడ్ రవీందర్ నాయక్ అన్నారు. ఉస్మానియా యూనివర్సిటీ జేఏసీ వ్యవస్థాపక అధ్యక్షుడిగా పని చేసిన తనను పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఆదరించి గెలిపించాలని కోరారు. మంగళవారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడారు. గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ ఎన్నికల బరిలో బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు నిరుద్యోగుల, ఉద్యోగుల పక్షాన తెలంగాణ రావడం కోసం ఉద్యమించిన నాయకులకు కాకుండా విద్యా వ్యాపారం చేసి కోట్లాది డబ్బులు సంపాదించిన వ్యక్తులకు టికెట్లు ఇచ్చారని ఆరోపించారు. నిరుద్యోగుల, ఉద్యోగస్తుల తరఫున పోరాడిన వ్యక్తులకు కాకుండా అనుభవం లేని వ్యక్తులకు టిక్కెట్లు ఇచ్చారన్నారు. వీరు రాజకీయ పార్టీల విధానాలకు లోబడి మాత్రమే మాట్లాడుతారన్నారు.కార్యక్రమంలో ఉస్మానియా విద్యార్థి జేఏసీ నాయకుడు దరావ సురేష్ నాయక్, బీసీ నాయకుడు రాజు యాదవ్, భాస్కర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

స్కిల్ డెవలప్‌మెంట్‌పై అవగాహన కలిగి ఉండాలి



మాట్లాడుతున్న బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి

నిజామాబాద్‌అర్బన్ : విద్యార్థులు సాంకేతికతను జోడించి స్కిల్ డెవలప్‌మెంట్‌పై అవగాహన కలిగి ఉండాలని ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి అన్నారు. నగరంలోని ఉమెన్స్ కళాశాలలో మంగళవారం జరిగిన స్కిల్ డెవలప్‌మెంట్ కార్యాక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. మారుతున్న కాలంతో పాటు విద్యా వ్యవస్థలో అనేక మార్పులు వచ్చినట్లు వివరించారు. విద్యార్థులు విద్యాతో పాటు అనేక రకాల స్కిల్ డెవలప్‌మెంట్‌పై శిక్షణ పొందాలని సూచించారు. సర్టిఫికెట్‌లకే పరిమితం కాకుండా సాంకేతిక నైపుణ్యాన్ని సాధించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, డీసీసీ అధ్యక్షులు సహకార సంఘం చైర్మన్ మానాల మోహన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ అరికెల నర్సారెడ్డి , మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ జంగిటి రాంచందర్, న్యాయవాది రాజేందర్‌రెడ్డి, కళాశాల పాలక వర్గం సభ్యులు పద్మానాభరెడ్డి, కిషన్‌రెడ్డి, పురం అబ్బన్న, ప్రిన్సిపల్ భారతి తదితరులున్నారు.

విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలి



సిరికొండ : విద్యార్థులు తమ జీవితంలో లక్ష్యాన్ని నిర్దేశించుకొని ముందుకు సాగాలని ప్రిన్సిపాల్ శ్రీనాథ్ తెలిపారు. ధర్పల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వార్షికోత్సవ వేడుకలను మంగళవారం నిర్వహించారు. ఈసందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ సెల్ ఫోన్‌కు దూరంగా ఉండి చదువుకోవాలని సూచించారు. పరీక్షలకు ఏవిధంగా సన్నద్ధం కావాలో వివరించారు. అధ్యాపకులు ప్రసన్న, జ్యోతి, హరిత, జయలక్ష్మీ, అరుణ, సురేష్‌బాబు, వరుణ్‌కుమార్, మహేష్‌కుమార్, చిన్న బాలయ్య, ప్రవీణ్‌కుమార్, విద్యార్థులు ఉన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక



జక్రాన్‌పల్లి : రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ బేస్‌బాల్ పోటీలకు తొర్లికొండ విద్యార్థులు ఎంపికయ్యారు. పాఠశాలకు చెందిన బాలికల విభాగంలో గంగోత్రి, మైత్రి, వనజ, సరిత, బాలుర విభాగంలో మురళి,విష్ణు,చైతన్య, సుశాంత్, శివలు ఎంపికయ్యారు. వీరు సిద్దిపేట జిల్లా గజ్వేల్‌లో ఈ నెల 28 నుంచి వచ్చే నెల 2 వరకు జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని పీడీ గంగామోహన్ తెలిపారు. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను ఎంఈవో శ్రీనివాస్, ఉపాధ్యాయ బృందం అభినందించారు.

సీపీఎస్ రద్దు కోసం నిరాహార దీక్ష చేస్తా

నిజామాబాద్ అర్బన్ : కరీంనగర్, నిజామాబాద్, మెదక్, ఆదిలాబాద్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థిగా తనను గెలిపిస్తే సీపీఎస్ రద్దు కోసం అమరణ నిరాహార దీక్ష చేస్తానని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి మామిడి సుధాకర్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయ సమస్యలపై సంపూర్ణ అవగాహన ఉందని, ఉపాధ్యాయులకు సేవ చేయడానికి ఎన్నికల్లోకి వచ్చానని తెలిపారు. తనను గెలిపిస్తే మహిళా ఉపాధ్యాయులకు ఉచితంగా ఎలక్ట్రిక్ స్కూటీలు ఇస్తానన్నారు. ఇచ్చిన హామీలను బాండ్ పేపర్‌పై రాసిస్తున్నట్టు పేర్కొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు మద్దతు ప్రకటించిన సీపీఎం



నిజామాబాద్ సిటీ: గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్‌రెడ్డికి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ టీపీటీఎఫ్ అభ్యర్థి అశోక్‌కు సీపీఎం పార్టీ మద్దతు తెలుపుతున్నట్లు జిల్లా కార్యదర్శి రమేష్‌బాబు తెలిపారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ..ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థిని ఓడించాలని పార్టీ నిర్ణయించిందన్నారు. కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణను విస్మరించిందని మండిపడ్డారు. జిల్లాకు కేటాయించిన జాతీయ పసుపు బోర్డుకు నిధులను కేటాయించలేదని మండిపడ్డారు. సమావేశంలో నాయకులు పెద్ది వెంకట్ రాములు, నూర్జహాన్ పాల్గొన్నారు.

28న 'చలో ఢిల్లీ' విజయవంతం చేయాలి

మోపాల్: కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ ఈనెల 28న చేపట్టిన చలో ఢిల్లీ సదస్సును విజయవంతం చేయాలని ప్రజాపంథా నిజామాబాద్ డివిజన్ కార్యదర్శి ఎం వెంకన్న కోరారు. మంగళవారం మండలంలోని తాడెంలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రబడ్జెట్‌లో కార్పొరేట్ లాభాలు 22శాతం పెరిగాయని, కార్మిక వర్గాల సంక్షేమానికి ఎలాంటి చర్యలు చేపట్టలేదని ఆరోపించారు. ఉద్యోగుల జీతభత్యం 17శాతం నుంచి 13శాతానికి తగ్గించారన్నారు. కార్యక్రమంలో నాయకులు సాయాగౌడ్, గంగమల్లు, నారాయణ, మురళీ, డి కిషన్, గణేష్, తదితరులు పాల్గొన్నారు.

'డిచ్‌పల్లి' సమస్యకు పరిష్కారం చూపాలి



సుభాష్‌నగర్: టీజీఎన్‌పీడీసీఎల్ డిచ్‌పల్లి డివిజన్ విభజన సమస్యకు త్వరగా పరిష్కారం చూపాలని సెక్రటరీ జనరల్ శ్రీధర్‌తోపాటు రాష్ట్ర, కంపెనీ నాయకులు మహేందర్‌రెడ్డి, శ్రీనివాస్, వర్కింగ్ ప్రెసిడెంట్ పూదరి గంగాధర్ మంగళవారం సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. గత కొన్ని రోజులుగా డిచ్‌పల్లి డివిజన్ సమస్య జఠిలం అవుతుండటంతో పాటు వాస్తవ పరిస్థితిని సీఎండీకి వారు వివరించారు. సానుకూలంగా స్పందించిన ఆయన.. సమస్యను పరిష్కరించి మార్చి మొదటివారంలో ఆదేశాలు జారీ చేస్తామని హామీ నిచ్చినట్లు తెలిపారు. నాయకులు వేణుగోపాల్ రావు, సుధాకర్, సర్దార్, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలు సిబ్బంది దృష్టికి తేవాలి



మాట్లాడుతున్న డీఈ టెక్నికల్ అల్జాపూర్ రమేశ్

సిరికొండ: విద్యుత్ సరఫరాలో ఎలాంటి సమస్యలున్నా సిబ్బంది దృష్టికి తీసుకురావాలని డీఈ టెక్నికల్ అల్జాపూర్ రమేష్ తెలిపారు. మండలంలోని చీమన్‌పల్లిలో విద్యుత్ సేవలపై ట్రాన్స్‌కో ఆధ్వర్యంలో అవగాహన సదస్సును మంగళవారం నిర్వహించారు. డీఈ మాట్లాడుతు గ్రామాల్లో కాని, వ్యవసాయ భూముల్లో ఎక్కడైనా లూజ్ లైన్‌లు సమస్యలు సిబ్బంది దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తామన్నారు. ఏవైనా మరమ్మత్తులు చేయాల్సి ఉంటే రైతులు విద్యుత్ జోలికి వెళ్లకుండా సిబ్బందికి సమాచారం ఇవ్వాలన్నారు. లైన్ ఇన్‌స్పెక్టర్ బాలచంద్రం, కాంగ్రెస్ నాయకులు రాజేందర్‌రెడ్డి, శ్రీనివాస్, బీఆర్ఎస్ నాయకులు శివారెడ్డి, లైన్‌మెన్లు రాజేష్, భిక్షపతి, పృథ్వీలాల్, గ్రామస్తులు ఉన్నారు.

నాణ్యమైన విద్యుత్ సరఫరాకు చర్యలు

సుభాష్‌నగర్: వేసవిలో వినియోగదారులకు మెరుగైన, నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించడానికి లోడ్‌కు అనుగుణంగా సిబ్బంది, అధికారులు అహర్నిశలు శ్రమిస్తూ ముమ్మర చర్యలు చేపడుతున్నారని ఎన్‌పీడీసీఎల్ నిజామాబాద్ సర్కిల్ సూపరింటెండెంట్ ఇంజినీర్ రాపెల్లి రవీందర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. లోడ్ పెరిగే అవకాశమున్న చోట ఈరోజు వరకు అదనపు పవర్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుచేశామని, 2 పవర్ ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యం కూడా పెంచామని పేర్కొన్నారు. 77 కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు బిగించామని, 91 ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యం కూడా పెంచామన్నారు. వేసవి కాల ముందస్తు కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసుకుని సరిపడా సదుపాయాలను ఏర్పాటు చేశామని తెలిపారు. లో ఓల్టేజ్‌లో హెచ్చు తగ్గులు లేకుండా కెపాసిటర్ బ్యాంకులు ఎంతగానో ఉపయోగపడుతాయని, విద్యుత్ సరఫరా వ్యవస్థలో రియాక్టివ్ పవర్ కాంపన్సేషన్ ద్వారా పవర్ ఫ్యాక్టర్ గణనీయంగా మెరుగుపర్చడానికి దోహదపడతాయని తెలిపారు.

వేడుకలకు ముస్తాబైన లొంక ఆలయం



లొంకలోని రామలింగేశ్వరస్వామి ఆలయం

సిరికొండ : జిల్లాలోని సుప్రసిద్ధ శైవ క్షేత్రం సిరికొండ లొంక. మండల కేంద్రం నుండి ఏడు కి.మీ.ల దూరంలోని దట్టమైన అడవుల్లో ఎత్తైన గుట్టల మధ్య ఉన్న లొంక (లంక)లో నీలకంఠ రామలింగేశ్వరస్వామి కొలువైనాడు. నీలకంఠుడు భక్తులచే నిత్యం పూజలందుకుంటున్నాడు.

జాతరకు ఏర్పాట్లు పూర్తి

మహాశివరాత్రిని పురస్కరించుకొని ఈ నెల 26 నుండి 28 వరకు మూడు రోజుల పాటు ఉత్సవాలు నిర్వహిస్తారు. జాతర జరగనుంది.అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆలయానికి రంగులు వేసి అందంగా అలంకరించారు.

లొంక రామలింగేశ్వర స్వామి పుష్కరిణిలో మహ కుంభమేళా త్రివేణి సంగమం పవిత్ర గంగా జలాన్ని బీజేపీ నాయకుడు లింబాద్రి దంపతులు మంగళవారం కలిపారు. మహ శివరాత్రి ఉత్సవాలకు విచ్చేసే భక్తులకు మహ కుంభమేళా అనుగ్రహం లభించాలని త్రివేణి సంగమం నుంచి పవిత్ర గంగా జలంను తీసుకొచ్చి ఇక్కడి పుష్కరిణిలో కలిపినట్లు ఆయన తెలిపారు.

ఆలయాల వద్ద పారిశుధ్య పనులు



శంభుని గుడి వద్ద శుభ్రంచేస్తున్న సిబ్బంది

నిజామాబాద్ సిటీ : మహాశివరాత్రి సందర్భంగా మంగళవారం బల్దియా అధికారులు పారిశుధ్య పనులు చేపట్టారు. జిల్లాకేంద్రంలోని ప్రధాన శివాలయాలు కంఠేశ్వర్, శంభుని గుడి, నందిగుట్ట ఆలయాల వద్ద చెత్త తొలగింపు, పిచ్చిమొక్కలు తొలగించారు. పలు ఆలయాల ఆవరణాలను సిబ్బందిచే పరిశుభ్రం చేయించారు. ఆలయాలకు వెళ్లే మార్గాలు సిద్ధంచేశారు. సానిటరీ సూపర్‌వైజర్ సాజిద్ అలీ, సానిటరీ ఇన్స్‌పెక్టర్లు సిబ్బందితో పనులు చేయించారు. ఆలయాల వద్ద తాగునీటి వసతి కలించారు. పలు చోట్ల గుంతలు పూడ్చి వేశారు.

క్షేత్ర పర్యటనలతో విషయ పరిజ్ఞానం



ఖిల్లాను సందర్శించిన సిర్‌పూర్ విద్యార్థులు

మోపాల్(నిజామాబాద్‌రూరల్) : విద్యార్థులకు పాఠశాల వయసులోని విజ్ఞానం ఎంతో విలువైందని, క్షేత్ర పర్యటనల ద్వారా అనేక విషయ పరిజ్ఞానం, విజ్ఞానం, వినోదాత్మకంగా అందుకుంటారని సిర్‌పూర్ జెడ్పీహెచ్ఎస్ తెలుగు ఉపాధ్యాయుడు, ప్రముఖ కవి కాసర్ల నరేష్ రావు అన్నారు. మంగళవారం మండలంలోని సిర్‌పూర్ జెడ్పీహెచ్ఎస్ ఏడోతరగతి విద్యార్థులు క్షేత్ర పర్యటన కింద డిచ్‌పల్లి ఖిల్లా రామాలయాన్ని సందర్శించారు. ఈసందర్భంగా డాక్టర్ కాసర్ల మాట్లాడుతూ ఏడో తరగతి తెలుగు పాఠ్యభాగంలో శిల్పి అనే పాఠం ఉందని, గుర్రం జాషువా రాసిన ఈ పాఠం చాలా అద్భుతమైన వర్ణనలతో శిల్పి గొప్పతనాన్ని తెలియజేసిందన్నారు. క్షేత్ర పర్యటనలో సాంఘిక ఉపాధ్యాయులు శ్యామల, విద్యార్థులు పాల్గొన్నారు.

'ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో విఫలం'



మాట్లాడుతున్న గుర్రం చెన్న కేశవరెడ్డి

సుభాష్‌నగర్: రాష్ట్రంలోని ఉపాధ్యాయ, ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని పీఆర్‌టీయూ మాజీ రాష్ట్ర అధ్యక్షుడు గుర్రం చెన్నకేశవరెడ్డి విమర్శించారు. మంగళవారం నగరంలోని బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత పదేళ్లు బీఆర్ఎస్ పాలనపై విసుగెత్తి కాంగ్రెస్‌కు ఓటేస్తే ఉద్యోగులు, ఉపాధ్యాయుల పరిస్థితి పెనం మీద నుంచి పొయ్యిలోకి పడినట్లు అయ్యిందని ఆరోపించారు. 14 నెలల కాంగ్రెస్ పాలనలో మూడు డీఏలు, పెండింగ్ బిల్లులు, 317 జీవో, పీఆర్సీల ఉసెత్తడం లేదని, జీపీఎ డబ్బులు రాక రిటైర్డ్ ఉద్యోగులు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పీఆర్‌టీయూ రాష్ట్ర కమిటీ పూర్తిగా అవినీతి ఊబిలో కూరుకుపోయిందని ఆరోపించారు. నిరుద్యోగులను నిలువునా ముంచుతున్న కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలన్నారు. బీజేపీ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి మల్క కొమరయ్య, పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి అంజిరెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ఆయన కోరారు. సమావేశంలో నాయకులు కొండా ఆశన్న, బద్దం కిషన్, చంద్రశేఖర్, నాగరాజు, గోపాల్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	89,500	వెండి(కిలో)	1,01,500
22 క్యారెట్స్	82,600		

– నిజామాబాద్ బిజినెస్

మాంసం ధరలు

చికెన్	ధరలు (కిలోకు)		
		డ్రెస్డ్	140
		లైవ్	90
స్కిన్‌లెస్	160	మటన్	800

కూరగాయల ధరలు(రూ.)

	హోల్‌సేల్	రిటైల్		హోల్‌సేల్	రిటైల్
టమాట	8	16	గాజరుగడ్డ	30	50
బెండకాయ	40	80	పచ్చిమిర్చి	25	50
జీరకాయ	40	60	దోసకాయ	30	50
దొండకాయ	30	50	ఆలుగడ్డ	20	40
బీర్నిసుకాయ	30	50	గోబిగడ్డ	15	30
కాకరకాయ	40	60	గోబిపువ్వు	20	40
వంకాయ	10	20	బీట్‌రూట్	25	50
పాలకూర	20	40	కరివేపాకు	60	110
మెంతికూర	30	50	చామగడ్డ	40	60
కొత్తిమీర	20	40	గోరుచిక్కుడు	40	60
పుదీనా	40	80	చిక్కుడుకాయ	40	60
క్యాప్సికం	40	60			

– సుభాష్‌నగర్

వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లిష్



ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏషియన్)

స్క్రీన్-1	జాబిలమ్మ నీకు అంత కోపమా -11.00, 1.40, 7.30 రిటర్న్ ఆఫ్‌ది డ్రాగన్-4.30, 10.20
స్క్రీన్-2	ఛావా(హిందీ)-11.00,1.40,4.40, 7.30, 10.20
స్క్రీన్-3	తండేల్(తెలుగు)-1.45, 4.40, 7.30 బాపు(తెలుగు)-10.30

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)

స్క్రీన్-1	రిటర్న్ ఆఫ్‌ది డ్రాగన్(తెలుగు)-10.15, 4.00, 7.10, 10.20 బాపు(తెలుగు)-1.25
స్క్రీన్-2	ఛావా(హిందీ)-10.00, 7.20, 10.40 రిటర్న్ ఆఫ్‌ది డ్రాగన్(తెలుగు)-1.20 జాబిలమ్మ నీకు అంత కోపమా -4.30
స్క్రీన్-3	జాబిలమ్మ నీకు అంత కోపమా-10.30 ఛావా(హిందీ)-1.20 తండేల్(తెలుగు)-4.40, 10.20 బాపు(తెలుగు)-7.45
స్క్రీన్-4	ది డెవిల్స్ చైర్(తెలుగు)-11.30 రామం రాఘవం(తెలుగు)-1.45 ఛావా(హిందీ)-4.20 సంక్రాంతికి వస్తున్నాం(తెలుగు)- 7.40 జాబిలమ్మ నీకు అంత కోపమా-10.40
లలితామహల్	తండేల్(తెలుగు)
దేవి	జాబిలమ్మ నీకు అంత కోపమా(తెలుగు)-11.15, 6.15 రిటర్న్ ఆఫ్‌ది డ్రాగన్(తెలుగు)-2.15, 9.15
నటరాజ్	ఛావా(హిందీ)
విజయ్	సంక్రాంతికి వస్తున్నాం (తెలుగు)